
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
శనివారం 13 జనవరి 2024



డీసీసీబీ పాలకవర్గం పదవీకాలం పొడిగింపు

విశాఖపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పాలక వర్గం పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించారు. కోలా గురువులు చైర్మన్‌గా ఆరు నెలల క్రితం నియమించిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీ కాలపరిమితి ఈనెల 17వ తేదీతో ముగియనున్నది. ఈ నేపథ్యంలో కమిటీ కాల పరిమితిని ఈనెల 18 నుంచి జూలై 17వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గత ఏడాది జూలైలో గురువులతో పాటు మరో ఆరుగురు సభ్యులతో పర్సన్ ఇన్‌చార్జి కమిటీని నియమించిన విషయం తెలిసిందే.

ముమ్మరంగా పసుపు సేకరణ

- ఏజెన్సీలో 20 వేల ఎకరాల్లో 'పచ్చ బంగారం' సాగు
- సేంద్రీయ పంటగా గుర్తింపు
- మార్కెటింగ్ సదుపాయం కల్పనలో ప్రభుత్వం విఫలం
- తక్కువ రేటుకు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్న గిరిజన రైతులు

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

మన్యంలో ప్రస్తుతం ఎక్కడ చూసినా గిరిజన రైతులు తమ పంట భూముల్లో సాగు చేసిన పసుపును తవ్వి సేకరిస్తున్న దృశ్యాలే దర్శనమిస్తున్నాయి. వరి, రాగుల కోతలు, కాఫీ పండ్ల సేకరణ పూర్తయిన తర్వాత గిరిజన రైతులు పసుపు సేకరణపై దృష్టిసారిస్తుంటారు. ఏజెన్సీ వ్యాప్తంగా సుమారు 20 వేల ఎకరాల్లో గిరిజనులు పసుపును సాగు చేస్తున్నారు. ఏటా డిసెంబరు నెలాఖరు నుంచి పొలాల్లో పసుపు కొమ్ములు, దుంపలు తవ్వి తీసి ఇళ్లకు చేరుస్తారు. రాబోయే పంటకు అవసరమైన మేర విత్తనాన్ని ఎంపిక చేసుకుని భద్రపరుస్తారు. మిగిలిన పసుపును పెద్దపెద్ద పాత్రల్లో బాగా ఉడకబెడతారు. తరువాత వడకట్టి ఎండలో పలుచగా ఆరబెడతారు. పసుపు కొమ్ములు, దుంపల్లో తేమ శాతం 15కన్న తక్కువగా వుండేలా చూసుకుని బస్తాల్లో ప్యాకింగ్ చేస్తారు. అనంతరం సమీపంలోని సంతలకు లేదా గ్రామాలకు వచ్చే వ్యాపారులకు విక్రయిస్తారు. దీంతో జనవరి నెలాఖరు నుంచి ఫిబ్రవరి వరకు వారపు సంతల్లో పసుపు క్రయవిక్రయాలు జోరుగా సాగుతాయి.



హుకుంపేట మండలం డూరువీధిలో రాశిగా పోసిన పసుపు కొమ్ములు, దుంపలు

మార్కెటింగ్ సదుపాయం శూన్యం

ఏజెన్సీలో గిరిజన రైతులు పసుపు పంట సాగులో రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించారు. అనాదిగా ఇదే పద్ధతిని పాటిస్తున్నారు. దీంతో మన్యంలో పండించే పసుపు సేంద్రీయ పంటగా గుర్తింపు పొందింది. మైదాన ప్రాంతంలో పండించే పసుపు కన్న చాలా నాణ్యంగా వుంటుందన్న పేరు కూడా వుంది. కానీ ఏజెన్సీలో గిరిజనులు పండించే పసుపునకు ప్రభుత్వం ఎటువంటి మార్కెటింగ్ సదుపాయం కల్పించలేదు. దీంతో పసుపు అమ్మకాల కోసం ప్రైవేటు వ్యాపారులు, దళారులపై ఆధారపడాల్సి వస్తున్నది. పోటీ మార్కెట్ (ప్రభుత్వ పరంగా కొనుగోళ్లు) లేకపోవడంతో వ్యాపారులు సిండికేట్‌గా మారి పసుపు ధరలను తమ గుప్పెట్లో పెట్టుకుంటున్నారు. తాము అడిగిన ధరకు గిరిజన రైతులు విక్రయించుకునే పరిస్థితిని కల్పిస్తున్నారు. దీంతో మైదాన ప్రాంతంలో మార్కెట్ ధరలతో పోలిస్తే ఏజెన్సీలో వ్యాపారులు 20 నుంచి 30 శాతం తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల తమ శ్రమకు తగిన ఫలితం లభించడంలేదని గిరిజన రైతులు వాపోతున్నారు. గిరిజన సహకార సంస్థ లేదా ట్రైఫెడ్ వంటి సంస్థలు తమ నుంచి పసుపు కొనుగోలు చేసి దేశీయ మార్కెట్‌లో విక్రయించే చర్యలు చేపట్టాలని గిరిజన రైతులు కోరుతున్నారు. కాగా ఏజెన్సీలో పసుపునకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామని తరచూ ప్రకటిస్తున్న జీసీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



హుకుంపేట మండలం డూరువీధిలో పసుపు తవ్వే పనుల్లో రైతులు



పాడేరులో శుక్రవారం ఉదయం 8.45 గంటల సమయంలో దట్టంగా కమ్ముకున్న పొగమంచు

మన్యంపై మంచు దుప్పటి

- ఉదయం పది గంటల వరకు దట్టంగా కురుస్తున్న పొగమంచు
- తగ్గని శీతల గాలుల ప్రభావం
- స్థిరంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు

పాడేరు (ఆంధ్రజ్యోతి), చింతపల్లి జనవరి 12: ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతున్నాయి. అయితే మంచు, చలి తీవ్రత అధికంగానే వున్నాయి. శుక్రవారం ఉదయం పది గంటల వరకు పొగమంచు వీడలేదు. జి.మాడుగులలో 11.3, జీకేవీధిలో 11.9, అరకులోయలో 12.4, చింతపల్లిలో 12.8, పాడేరులో 12.9, ముంచంగిపుట్టులో 13 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మంచు దట్టంగా కురుస్తుండడంతో రహదారులపై విజిబిలిటీ తగ్గిపోయింది. వాహనదారులు హెడ్‌లైట్లు, ఫాగ్ ల్యాంపులు వేసుకుని ప్రయాణం సాగిస్తున్నారు. మిట్టమధ్యాహ్నం మినహా మిగిలిన అన్నివేళ్లలో వాతావరణం చలిగా వుంటున్నది. అర్ధరాత్రి నుంచి మరుసటి రోజు ఉదయం పది గంటల వరకు మంచు కురుస్తున్నది.



చింతపల్లిలో కురుస్తున్న మంచు



కన్నంపేట సమీపంలో కల్వర్టు నిర్మాణానికి గోతులు తవ్వి వదిలేసిన దృశ్యం

గోతుల దారిలో వెళ్లేదెలా?

- అధ్వానంగా చోద్యం- బాలారం ప్రధాన రహదారి
- 30 గ్రామాల ప్రజలకు తప్పని ఇబ్బందులు



డి.కొత్తూరు వద్ద గోతులమయంగా రహదారి

కొయ్యూరు, జనవరి 12:

చోద్యం నుంచి బాలారం వెళ్లే ప్రధాన రహదారి గోతులతో అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. దీంతో సుమారు 30 గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారిని నిర్మించినప్పటి నుంచి కనీసం మరమ్మతులు చేయకపోవడంతో పరిస్థితి దారుణంగా ఉంది.



కొత్తూరు- బాలారం మధ్య ఛిద్రమైన రోడ్డు

చోద్యం నుంచి బాలారం వరకు రహదారి పునర్నిర్మాణానికి నిధులు కేటాయించినట్టు ప్రకటించిన పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి గత సెప్టెంబరులో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా శంకుస్థాపన చేశారు. ఇది జరిగి నాలుగు నెలలు గడిచినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. నిధులు మంజూరైయ్యాయనే ఉద్దేశంతో శంకుస్థాపనకు ఖర్చు చేసిన కాంట్రాక్టరు కన్నంపేట సమీపంలో కల్వర్టు నిర్మాణాలకు వీలుగా పైపులు తెచ్చి రహదారికి ఇరువైపులా తవ్వకాలు జరిపారు. నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిపివేశారు. దీంతో ప్రస్తుతం పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. బాలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి కన్నంపేట వరకు రహదారి పొడవునా ఇటీవల కురిసిన వర్షాలకు మరింత గోతులు పడడంతో ఇటుగా ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇక బాలారం నుంచి కంఠారం మధ్యలో కిలోమీటరు మేర రహదారి పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. డేగలపాలెం సెంటరు నుంచి కొమ్మిక, అక్కడ నుంచి బొర్రంపేట మధ్య అడుగడుగునా గోతులు పడ్డాయి. రహదారి అధ్వానంగా ఉండడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కనీసం ఈ రహదారికి మరమ్మతులు చేయించాలని 30 గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

స్పందనకు సమయపాలన పాటించకపోతే చర్యలు

- అధికారులకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరిక
- స్పందనలో 87 వినతులు స్వీకరణ



అర్జీదారుల సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పక్కన జేసీ, ఐటీడీఏ పీవో, సబ్‌కలెక్టర్

పాడేరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్పందన కార్యక్రమానికి హాజరయ్యే అధికారులు సమయపాలన పాటించకుంటే శాఖా పరమైన చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటిల్లోని సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలన్నారు. సమస్య పరిష్కారం అయ్యిందీ, లేనదీ అర్జీదారులకు తెలపాలన్నారు. పలువురు అధికారులు స్పందనలో స్వీకరించిన అర్జీలపై సక్రమంగా ... మిగతా 8వ పేజీలో

అరకులోయ ఎంఈవో-1 సరెండర్

- రాజకీయ జోక్యంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే
- త్రినాథరావును ప్రభుత్వానికి సరెండర్ చేసిన కలెక్టర్

పాడేరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అరకులోయ మండల విద్యా శాఖాధికారి-1 వి.త్రినాథరావును జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వి.త్రినాథరావు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రాజకీయాలు చేస్తున్నారని అరకులోయ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాలని డిప్యూటీ ఈవోను విచారణాధికారిగా కలెక్టర్ నియమించారు. అయితే విచారణాధికారికి సైతం సదరు ఎంఈవో సహకరించకపోవడంతోపాటు, జిల్లా కలెక్టర్ నిర్వహించిన పలు సమీక్షలకు గైర్హాజరయ్యారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగిగా వుంటూ రాజకీయాలతో సంబంధం వుండకూడదనే నిబంధనను అతిక్రమించారని కలెక్టర్ నిర్ధారించారు. దీంతో అరకులోయ ఎంఈవో-1 వి.త్రినాథరావును ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



వి.త్రినాథరావు (ఫైల్)



పాడేరులో రెడీమేడ్ దుస్తుల దుకాణం వద్ద కొనుగోలుదారులు

పాడేరులో సంక్రాంతి సందడి

- కిటకిటలాడిన షాపులు
- దుస్తులు, గృహోపకరణాలు, కిరాణా సామగ్రి కొనుగోలు చేసిన గిరిజనులు
- రద్దీగా మారిన మెయిన్‌రోడ్డు, పలుమార్లు ట్రాఫిక్ జామ్

పాడేరురూరల్, జనవరి 12: సంక్రాంతి పండుగ దగ్గర పడడంతో పాడేరులో పలు రకాల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. గత రెండు రోజుల నుంచి స్థానికులతోపాటు చుట్టుపక్కల మండలాల నుంచి ప్రజలు షాపింగ్‌కు తరలివస్తున్నారు. రెడీమేడ్ దుస్తులు, వస్త్రాలు, గృహోపకరణాలు, కిరాణా సరకులు విక్రయించే దుకాణాల్లో ఎక్కువ రద్దీ నెలకొంది. శుక్రవారం ఇక్కడ సంత జరగడంతో గిరిజనులు తమ వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించుకుని, వచ్చిన డబ్బులతో కొత్త దుస్తులు, గృహోపకరణాలు, కూరగాయాలు, ఇతర సామగ్రి కొనుగోలు చేశారు. కాగా సంక్రాంతి కొనుగోలుదారులు, వాహనాలతో పాడేరు మెయిన్ రోడ్డు రద్దీగా మారింది. పలుమార్లు ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.



అంగన్‌వాడీల శిబిరం వద్ద మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్యపడాల్

సమ్మె విచ్ఛిన్నానికి ప్రయత్నిస్తే సహించం

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ హెచ్చరిక
- అంగన్‌వాడీలకు పూర్తి వేతనాలు చెల్లించాలని డిమాండ్

పాడేరు రూరల్, జనవరి 12: అంగన్‌వాడీల సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే సహించేది లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారంనాటికి 32వ రోజుకు చేరుకుంది. డిసెంబరు రెండో వారంలో సమ్మె మొదలుకాగా, ఆ నెలకు సంబంధించి సమ్మె రోజుల వేతనాలు కట్ చేసి మిగిలిన సొమ్మును అంగన్‌వాడీల బ్యాంకు ఖాతాలకు జమ చేయడాన్ని ఆయన తప్పు పట్టారు.

కోత విధించిన వేతనాల సొమ్మును తక్షణమే బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా గురువారం రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ముంచంగిపుట్టు ప్రాజెక్టుకు చెందిన అంగన్‌వాడీలు గురువారం రాత్రి గిరిజన సంప్రదాయ థింసా నృత్యంతో ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యుడు ఎల్.సుందరరావు, అంగన్‌వాడీల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

షుగర్ పెరుగుతోంది

కొవిడ్ తరువాత భారీగా పెరిగిన డయాబెటిస్ బాధితులు

- కేజీహెచ్‌లోని ఎండోక్రైనాలజీ విభాగంలో వారానికి మూడు రోజులు ఓపీ
- ఒక్కోరోజు 400 మంది వరకూ రాక
- అందులో కొత్తవారు సుమారు 80 మంది
- యుక్త వయస్కుల్లోనూ సమస్య
- ప్రతి వంద మందిలో 62 మంది మహిళలు.. 38 మంది పురుషులు
- ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడమే కారణం



విశాఖపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): షుగర్ బారినపడుతున్న వారి సంఖ్య గడిచిన కొన్నాళ్లుగా బాగా పెరుగుతోంది. ముఖ్యంగా కొవిడ్ తరువాత కేసులు గణనీయంగా పెరిగినట్టు వైద్యులు చెబుతున్నారు. కేజీహెచ్‌లోని ఎండో క్రైనాలజీ విభాగం ఓపీకి ఐదేళ్ల క్రితంతో పోలిస్తే ప్రస్తుతం 20 శాతం మేర రోగులు పెరిగినట్టు పేర్కొంటున్నారు. కరోనా వైరస్ వ్యాప్తికి ముందు, తరువాత చాలా వ్యత్యాసం కనిపిస్తోందంటున్నారు. కేజీహెచ్‌లో ఎండోక్రైనాలజీ విభాగంలో మంగళ, గురు, శనివారాల్లో ఓపీ సేవలు అందిస్తుంటారు. ఆయా రోజుల్లో షుగర్ బాధితులు సుమారు 450 మంది చొప్పున వస్తున్నారు. వీరిలో కొత్తగా వచ్చేవారి సంఖ్య 70-80 వరకు ఉంటుంది. మొత్తంలో 25-30 ఏళ్ల వయస్కులు పది మంది, 30-35 ఏళ్ల మధ్యవారు పది నుంచి 15 మంది వరకూ ఉంటున్నారు. 35 ఏళ్లు పైబడిన వాళ్లు 40 నుంచి 55 మంది ఉంటున్నారు.

యుక్త వయస్కుల్లో పెరుగుదల

గతంతో పోలిస్తే యుక్త వయస్కుల్లో షుగర్ సమస్య పెరుగుతోంది. గతంలో 35 ఏళ్లలోపు వందలో ఇద్దరు, ముగ్గురికి మాత్రమే షుగర్ కనిపించేది. ప్రస్తుతం ఆ సంఖ్య నాలుగు రెట్లు పెరిగింది. ప్రతి వంద కొత్త కేసుల్లో కనీసం 15 నుంచి 20 మంది 30 ఏళ్లలోపు వారు ఉంటున్నారు. అదే 40 ఏళ్లలోపు వాళ్లు అయితే 40 శాతం ఉంటున్నారు. షుగర్ బాధితుల్లో 20 శాతం మందికి ఇన్సులిన్ ఇవ్వాల్సి వస్తోంది. మిగిలినవాళ్ల టాబ్లెట్లతో నియంత్రణలో ఉంచుకుంటున్నారు. ఇన్సులిన్ ఇవ్వాల్సి వస్తున్న ప్రతి పది మందిలో ఒకరు 30 ఏళ్లలోపు వాళ్లు ఉండడం గమనార్హం. ఇకపోతే, కేజీహెచ్‌కు వచ్చే షుగర్ బాధితులను పరిశీలిస్తే మహిళలు అధికంగా ఉంటున్నారు. వంద మందిలో 62 మంది మహిళలు ఉంటే, 38 మంది పురుషులు ఉంటున్నారు. పురుషులతో పోలిస్తే మహిళలు క్రమం తప్పకుండా మందులు వినియోగించడం, ఇతర జాగ్రత్తలను పాటించడంలో శ్రద్ధ వహిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

సుదూర ప్రాంతాల నుంచి..

కేజీహెచ్ ఎండోక్రైనాలజీ ... మిగతా 8వ పేజీలో

ఆకట్టుకుంటున్న గ్లాడియోలస్

- సీజన్ ఆఖరిలోనూ విరబూసిన పూలు



ఆర్ఏఆర్ఎస్‌లో గ్లాడియోలస్ పూలు

చింతపల్లి, జనవరి 12: చింతపల్లిలోని ఆచార్య ఎన్‌జీరంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్)లో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న గ్లాడియోలస్ పూలు సీజన్ ఆఖరిలోనూ ఆకట్టుకుంటున్నాయి. పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ప్రయోగాత్మకంగా చేపట్టిన గ్లాడియోలస్ పూల సాగు విజయవంతమైన విషయం తెలిసిందే. గంజాయికి ప్రత్యామ్నాయంగా గిరిజన రైతులతో పూల సాగు చేయించాలనే లక్ష్యంతో ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాయం అధికారులు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానానికి రెండేళ్ల కిందట పూలసాగు ప్రాజెక్టును మంజూరు చేశారు. గ్లాడియోలస్, జెర్బరా, చైనాఆస్టర్, లిల్లియం(పసుపు) పూల మొక్కలను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్న శాస్త్రవేత్తలు ఇక్కడ ప్రయోగాత్మక సాగును ప్రారంభించారు. రెండేళ్ల ఫలితాలు ఆశాజనంగా ఉండడంతో మూడో ఏడాది కూడా పూల సాగును కొనసాగిస్తున్నారు. జెర్బరా, లిల్లియం ఇప్పటికే పూతకొచ్చాయి. సీజన్ ఆఖరిలో విరబూసిన గ్లాడియోలస్ పూలు కనువిందు చేస్తున్నాయి. సాధారణంగా నవంబరు నుంచి జనవరి మొదటి వారం వరకు గ్లాడియోలస్ మొక్కలు పూలు పూస్తాయి. ఈ ఏడాది రెండో వారంలోనూ కూడా పూలు పూశాయి.

క్రైం... crime news

లారీ ఢీకొని ఇద్దరి మృతి

» పండక్కి ఇంటికి వెళుతుండగా కబళించిన మృత్యువు

విశాఖపట్నం, జనవరి 12: పండక్కి సొంతూరు బయలుదేరిన ఇద్దరిని మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. ఇందుకు సంబంధించి ఆరిలోవ ట్రాఫిక్ ఎస్.ఐ.శ్రీకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం కూర్మనాథపురం పంచాయతీకి చెందిన కూర్మనాథపురం మీనా (30), అదే ప్రాంతంలో గల బంజీరపేట గ్రామానికి చెందిన జెన్న లోకనాథం (25) ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చారు. ప్రస్తుతం చినగదిలి హెల్త్ సిటీలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి భవనంలో పనిచేస్తున్నారు. పండుగకని శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై స్వస్థలానికి బయలుదేరారు. అయితే వీరి వాహనాన్ని జాతీయ రహదారిపై జూ పార్కు సమీపంలో లారీ ఢీకొంది. దీంతో మీనా, లోకనాథం ఇద్దరూ వాహనం పైనుంచి లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతిచెందారు. మృతుల కుటుంబాలకు పోలీసులు సమాచారం అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ దుర్మరణం


దుంగ కనకరాజు(ఫైల్)

సబ్బవరం, జనవరి 12: మండలంలోని సబ్బవరం-చోడవరం రోడ్డులో గాలిభీమవరం జంక్షన్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ దుర్మరణం చెందారు. మరొక్కరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొటివాడకు చెందిన దుంగ కనకరాజు(45) ఆటోపై గురువారం రాత్రి చోడవరం వైపు నుంచి సబ్బవరం వైపు బట్టలు లోడుతో వస్తున్నాడు. గాలిభీమవరం జంక్షన్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి బైక్ ఆటోను బలంగా ఢీకొంది. దీంతో ఆటో అదుపు తప్పడంతో డ్రైవర్ కనకరాజు రోడ్డుపై పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మ, ముగ్గురు కుమార్తెలు భవానీ, కళ్యాణి, సాధన ఉన్నారు. జీవనాధారం కోల్పోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడిందని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పిన్నింటి రమణ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


నాగేశ్వరరావు

కోటవురట్ల, జవనరి 12: మండలంలోని కొత్తగొట్టివాడలో విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానిక ఎస్ఐ రమణయ్య అందజేసిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొత్తగొట్టివాడ గ్రామానికి చెందిన రాచపతి నాగేశ్వరరావు(42) శుక్రవారం గ్రామ సమీపంలో గల పశువుల పాకలో విద్యుత్ హోల్డర్‌కు బల్బు అమరుస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబసభ్యులు హుటాహుటిన కోటవురట్ల ప్రభుత్వ ఆస్పత్రికి ఆటోలో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. నాగేశ్వరరావుకు భార్య ఉమాదేవి, ఇద్దరు కుమార్తెలు మేఘన, వసుంధర ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్ఐ రమణయ్య తెలిపారు. మృతదేహన్ని కోటవురట్ల ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

పట్టుబడ్డ కోళ్ల దొంగలు

సబ్బవరం, జనవరి 12: మండలంలోని ఆరిపాకలో ఈనెల పదో తేదీన ఆరు డింకీ కోడి పుంజులు అపహరించిన ముగ్గురిలో ఇద్దరు వ్యక్తులను సీఐ పిన్నింటి రమణ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆరిపాకలో పిన్నంరాజు రామకృష్ణ కొన్నేళ్లుగా డింకీ కోళ్లు మేపుతున్నారు. ఒక్కో కోడిపుంజు విలువ రూ.60 వేలు నుంచి రూ.80 వేలు ఉంటుంది. ఈనెల 10వ తేదీన గుర్తు తెలియని దొంగలు ఆరు కోడి పుంజులను ఎత్తుకుపోయారు. సోమవారం రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అయితే గతంలో లగిశెట్టిపాలెం, ఆరిపాక, టెక్కలిపాలెం, రాయపురఅగ్రహారం తదితర గ్రామాల్లో చిల్లర దొంగతనాలకు పాల్పడ్డ కొంతమందిని అప్పట్లో పోలీసులు గుర్తించారు. వారిపై అనుమానించిన పోలీసులు విజయనగరం జిల్లా కొత్తవలసలో శనివారం గంటా జార్జి, గంటా విలియంలను విచారించారు. వారి వద్ద నుంచి ఆరు కోడి పుంజులను స్వాధీనం చేసుకొన్నారు. వారిని అరెస్టు చేసి, అనకాపల్లి కోర్టుకు తరలించారు. మరొకరిని పట్టుకోవలసి ఉందని సీఐ రమణ తెలిపారు.

70 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు

మాడుగుల రూరల్, జనవరి 12 : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నుంచి చోడవరం వైపు వస్తున్న కారులో 70 కిలోల గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్టు ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు శుక్రవారం ముకుందపురం పెట్రోల్ బంకు సమీపంలో వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ఇంతలో పాడేరు నుంచి చోడవరం వైపునకు వస్తున్న కారును ఆపి పరిశీలించగా, అందులో అదే జిల్లా ముంచంగిపుట్టు మండలం పనసపుట్టు గ్రామానికి చెందిన జె.జగన్నాథం గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. అతనిని అరెస్టు చేసి, కారు సీజ్ చేశామన్నారు.

వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో డీబీపీ పోటీ


దాసరి అన్నపూర్ణ

పాయకరావుపేట, జనవరి 12: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో అన్ని స్థానాలకు దళిత బహుజన పార్టీ(డీబీపీ) తరఫున అభ్యర్థులు పోటీ చేస్తారని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు దాసరి అన్నపూర్ణ ప్రకటించారు. శుక్రవారం పాయకరావుపేటలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత బహుజనులకు ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, రక్షణ ఉండాలంటే రాజ్యాధికారం సాధన ద్వారానే సాధ్యం అవుతుందన్నారు. రాష్ట్రంలో త్వరలో జరుగనున్న అసెంబ్లీతోపాటు లోక్‌సభ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ డీబీపీ తరఫున అభ్యర్థులు పోటీ చేస్తారన్నారు. ఫిబ్రవరి 5న అభ్యర్థుల తుది జాబితాను పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ ప్రకటిస్తారన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో డీబీపీ తరఫున అభ్యర్థి పోటీలో ఉంటారని ఆమె తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	80.00
లైవ్ ధర	100.00
విత్ స్కిన్	170.00
స్కిన్ లెస్	180.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	599
విజయనగరం	603
శ్రీకాకుళం	603

సోషల్ మీడియాలో పోస్టు పెడితే ఇళ్లకు వెళ్లి బెదిరిస్తారా?

» ఎమ్మెల్యే చెపితే అరెస్టు చేస్తారా..?
» పోలీసు వ్యవస్థను జగన్ బానిసను చేసి వాడుకుంటున్నారు
» మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఆగ్రహం


పట్టణ పోలీసులతో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జనవరి 12: సోషల్ మీడియాలో పోస్టు పెడితే రాత్రి సమయంలో ఇళ్లకు వెళ్లి ఆడవాళ్లను బెదిరించి, దౌర్జన్యం చేస్తారా.. అని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పోలీసులను ప్రశ్నించారు. ఈ అంశంపై శుక్రవారం సీఐ గణేశ్‌తో మాట్లాడేందుకు కార్యకర్తలతో కలిసి ఆయన నర్సీపట్నం పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. సీఐ పాయకరావుపేట వెళ్లారని సిబ్బంది చెప్పడంతో అయ్యన్న అసహనం వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్‌కు వస్తున్నట్టు సీఐకి ముందుగా సమాచారం ఇచ్చినా లెక్క చేయకుండా వెళ్లి పోవడం ఏమిటన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనిమిరెడ్డి తాతాజీ, బంగారు కొండ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారన్న ఆరోపణలపై గురువారం రాత్రి 10 గంటల సమయంలో వారి ఇళ్లకు పోలీసులు వెళ్లి స్టేషన్‌కు రమ్మని బెదిరించారని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత వ్యవస్థలన్నింటినీ సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పోలీసు వ్యవస్థను బానిసను చేసి వాడుకుంటున్నారని విమర్శించారు. ఐపీఎస్‌లు కూడా అదే విధంగా తయారయ్యారని వాపోయారు. ఇన్ని జరుగుతున్నా పోలీసులు కేసులు పెడతారని భయపడి మేధావులు మాట్లాడడం లేదన్నారు. ఎమ్మెల్యే చెప్పారని సోషల్ మీడియాలో పోస్టు పెడితే అరెస్టు చేస్తారా.. అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల డబ్బులతో జీతాలు తీసుకుంటూ వారికి రక్షణ కల్పించాల్సింది పోయి.. ఈ దౌర్జన్యం ఏమిటని పోలీసులనుద్దేశించి అన్నారు. నాతవరంలో రెండేళ్ల క్రితం కల్యాణ్ అనే కుర్రాడిని కాళ్లు చేతులు కట్టేసి కాలువలో పడేసి చంపేశారని ఆరోపించారు. ఈ కేసు ఏం చేశారని ప్రశ్నించారు. రెండేళ్లు గడుస్తున్నా ఎవరు చేశారో గుర్తించలేకపోయారా... అని ప్రశ్నించారు. గొలుగొండ టీడీపీ నాయకుడు నానిబాబును పప్పుశెట్టిపాలెంలో నాయుడు అనే వ్యక్తి బూతులు తిట్టాడని ఏడాది క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారని, ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. వైసీపీ నాయకులు గుడివాడ నాని, అనిల్, అంబటి రాంబాబు బూతులు మాట్లాడుతుంటే పోలీసులు ఎందుకు యాక్షన్ తీసుకోవడం లేదన్నారు. రాబోయేది టీడీపీ ప్రభుత్వం అని, మీ పరిస్థితి ఏమిటో ఆలోచించుకొండని పోలీసులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, 25వ వార్డు కౌన్సిలర్ రాజేశ్‌లతో పాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు యువత పట్టుదలతో చదవాలి

» నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి
» లోక్నో సీబీసీఐడీ ఏడీజీ కిల్లాడ సత్యనారాయణ


వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏడీజీ సత్యనారాయణ

నర్సీపట్నం, జనవరి 12: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు ఏర్పాటు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఉత్తరప్రదేశ్‌లోని లక్నో సీబీసీఐడీ ఏడీజీ కిల్లాడ సత్యనారాయణ వెల్లడించారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఇక్కడి శాఖా గ్రంథాలయంలో శుక్రవారం జాతీయ యువజనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన తొలుత వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ లక్ష్యాన్ని చేరుకునే వరకు విశ్రాంతి లేకుండా కష్టపడి చదవాలని యువతరానికి సూచించారు. అభిరుచికి తగ్గ కోర్సు ఎంపిక చేసుకోవాలన్నారు. ఐఏఎస్‌కు ఎంపికైన నర్సీపట్టణానికి చెందిన మౌర్య చాలా పట్టుదలతో చదివి అనుకున్నది సాధించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో శాఖా గ్రంథాలయాధికారిణి దమయంతి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు లేఅవుట్‌కు రహస్యంగా రోడ్డు

» పనులను అడ్డుకున్న స్థానికులు



రాత్రి పనులు చేస్తున్న కూలీలు... రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్న స్థానికులు

కొత్తూరు, జనవరి 12: మేజర్ పంచాయతీ కొత్తూరు, రామాపురం కాలనీ నుంచి పిసినికాడ పంచాయతీ పరిధిలోని ప్రైవేటు లేఅవుట్‌కు వైసీపీ నేతలు వేయిస్తున్న రహదారి పనులను స్థానికులు, రైతులు గురువారం రాత్రి అడ్డుకున్నారు. ప్రైవేటు లేఅవుట్‌కు కొందరి రైతుల జిరాయితీ, ప్రభుత్వ స్థలాల మీదుగా వైసీపీ నేతలు రోడ్డు వేస్తున్నారని తెలియడంతో స్థలాల యజమానులు, స్థానికులు పనులను అడ్డుకొని, అక్కడున్న కాంట్రాక్టుదారున్ని నిలదీశారు. ఎటువంటి గ్రామసభ తీర్మానం లేకుండా లేఅవుట్‌లోకి వెళ్లేందుకు అనుమతులు ఎవరిచ్చారని ప్రశ్నించారు.

దీంతో కాంట్రాక్టర్ సూరిబాబు పొంతన లేని సమాధానం చెప్పడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ సర్వే నంబరు 47/3/సీలో తమకు చెందిన సొంత స్థలాల్లో రాత్రికి రాత్రే రహస్యంగా రోడ్డు వేయాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. పిసినికాడ గ్రామ సర్పంచ్, కొత్తూరు వైసీపీ నేతలతో పాటు ఉప తహసీల్దార్, మండల పరిషత్ అధికారుల కుట్రతోనే రోడ్డు వేస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ స్థలాలు, రహదారుల నిర్మాణాలపై న్యాయస్థానాల్లో కూడా కేసులు ఉన్నాయన్నారు. వాటిని అధికారులు తప్పుదోవ పట్టించే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. శుక్రవారం న్యాయస్థానం 8 వారాల పాటు ఏ నిర్మాణాలను చేపట్టవద్దని ఉత్తర్వులు ఇచ్చినట్టు స్థానికులు చెప్పారు. ఈ విషయమై వివరణ కోరేందుకు డిప్యూటీ తహసీల్దార్‌కు ఫోను చేయగా ఆయన అందుబాటులో లేరు. తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కేంద్ర నిధులు జమ చేయకుంటే కమిషనర్ కార్యాలయం ముట్టడి

పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌రాజు



ఎస్.రాయవరం, జనవరి 12: రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన రూ.595 కోట్లను నాలుగు రోజుల్లో స్థానిక సంస్థలకు జమ చేయాలని, లేకుంటే రాజకీయాలకు అతీతంగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తాడేపల్లిలోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యేజెర్ల వినోద్‌రాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంబంధిత అధికారుల నుంచి అందిన సమాచారం మేరకు నాలుగు రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం రెండవ విడత రూ. 988 కోట్లు విడుదల చేసిందన్నారు. వీటిలో కేవలం రూ. 393 కోట్లు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల పీఎఫ్ఎంఎస్ ఖాతాల్లో జమ చేసిందన్నారు. మిగతా నిధులు రూ. 595 కోట్లను దారిమళ్లించిందని ఆరోపించారు. గతంలో కూడా ఇదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.8,629 కోట్లను దారి మళ్లించిన విషయం తెలిసిందేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించిన మొత్తం నిధులను తిరిగి పంచాయతీ ఖాతాల్లో జమ చేసేంతవరకు పోరాటం చేస్తామని వినోద్‌రాజు హెచ్చరించారు.

సింహాద్రి ఎన్‌టీపీసీలో సాంకేతిక లోపం

» నిలిచిపోయిన ఉత్పత్తి

పరవాడ, జనవరి 12: అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో గల సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లో శుక్రవారం సాంకేతిక లోపం తలెత్తింది. ఐదు వందల మెగావాట్ల సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్‌లో ఉత్పత్తి నిలిచిపోయింది. అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు ప్రారంభించారు. శుక్రవారం అర్ధరాత్రికల్లా యూనిట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరిస్తామని అధికారులు వెల్లడించారు. మిగతా ఒకటి, రెండు, మూడు యూనిట్‌లలో ఉత్పత్తి యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

వివేకానందుని స్ఫూర్తిగా తీసుకోవాలి

» కాగ్ సీనియర్ ఆడిటర్ కేఎన్.రాజు పిలుపు

అనకాపల్లి టౌన్, జనవరి 12: స్వామి వివేకానందుని స్ఫూర్తిగా తీసుకోవాలని కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఆఫ్ ఇండియా సీనియర్ ఆడిటర్ కేఎన్.రాజు అన్నారు. గౌరీ గ్రంథాలయంలో శుక్రవారం జాతీయ యువజన దినోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజు మాట్లాడుతూ యువత స్వామి వివేకానంద ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. రామకృష్ణ మిషన్ అనుబంధ సంస్థ విశాఖ యువ మహామండలి కార్యనిర్వాహక సభ్యుడు మూర్తి మాట్లాడుతూ మంచి భావనలు మానవాళికి అందించగలిగితే జీవితం వ్యర్థం కాదన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర సలహా కమిటీ సభ్యులు వెంకటరణ, గౌరీ గ్రంథాలయం ప్రతినిధులు గంగాధర్, ఎం.బాపునాయుడు పాల్గొన్నారు.

వైసీపీ నేతలైతే ఓకేనా?

» వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో కోడి పందెం


కోడి పందేలను వీక్షిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ఇతర నేతలు

విశాఖపట్నం, జనవరి 12: సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీతో సహా స్థానికంగా ఉన్న పోలీసు అధికారులు హెచ్చరికలు జారీచేస్తున్నారు. అయితే సంక్రాంతి సంబరాల్లో భాగంగా శుక్రవారం విశాఖ నగరంలోని మాధవధారలో నిర్వహించిన కోడి పందేలను ఉమ్మడి విశాఖ జిల్లా వైసీపీ కో-ఆర్డినేటర్, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఉత్తరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే రాజు, ఆ పార్టీ సిటీ ప్రెసిడెంట్ కోలా గురువులు దగ్గరుండి వీక్షించారు. నేతలతో కలిసి కోళ్లను ఉత్సాహపరిచేలా సందడి చేశారు. కోడి పందేలు వద్దని పోలీసులు హెచ్చరిస్తుంటే, అధికార పార్టీ నేతలే దగ్గరుండి నిర్వహించడం దేనికి సంకేతమని కార్యక్రమంలో పాల్గొన్నవారు ఆశ్చర్యపోయారు.

20న వేల్పులవీధి గౌరమ్మ జాతర


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, జనవరి 12: ప్రఖ్యాతిగాంచిన వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల జాతర మహోత్సవాన్ని ఈనెల 20వ తేదీన అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వాకాడ బాబు, మద్దాల నూకరాజు చెప్పారు. స్థానిక వేల్పులవీధి సీతారామ కల్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఉత్సవ కార్యక్రమాల ప్రతిని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇప్పటికే మెయిన్‌రోడ్డులో గౌరీపరమేశ్వరుల ఆలయంలో ప్రతి రోజూ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. జాతర సందర్భంగా భారీ ఎత్తున విద్యుత్ సెట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులను ఆహ్వానించామన్నారు. అలాగే భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు, నేలవేషాలను ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయం వద్ద ఏర్పాట్లు చేశామని, 20వ తేదీన అమ్మవారిని ప్రత్యేక రథంపై ఏర్పాటు చేసి పురవీధుల్లో ఊరేగిస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు శీరంశెట్టి నరసింగరావు, వేల్పుల గణేష్, మద్దాల కూర్మారావు, మద్దాల రమణబాబు, బొండా శంకరరావు, దామరౌతు రామారావు, ముమ్మిన సూరిబాబు, నల్లల రాజు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీవారి ఊరేగింపు


రాజాధిరాజ వాహనంపై మాఢవీధుల్లో స్వామివారి తిరువీధి సేవ

నక్కపల్లి, జనవరి 12: ఉపమాక క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి తిరువీధి సేవ ఘనంగా జరిగింది. ముందుగా ఆలయానికి ఆనుకుని వున్న స్వామివారి పుష్పతోటలో గోదాదేవి అమ్మవారిని తీసుకెళ్లి నీరాటోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. ధూప,దీప నైవేద్య నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి హారతులిచ్చారు. ఆలయ అర్చకులు తిరుప్పావై పాశుర విన్నపం చేశారు. తదుపరి రాజాధిరాజ వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని, పల్లకీపై గోదాదేవి అమ్మవారిని అలంకరించి మాడవీధుల్లో తిరువీధి సేవ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చోడవరం బార్ అధ్యక్షుడు డేవిడ్‌కు వైసీపీ అధిష్ఠానం పిలుపు?

» ఆర్థిక స్థితిగతులపై ఆరా


కాండ్రేగుల డేవిడ్

చోడవరం, జనవరి 12: స్థానిక వైసీపీ నాయకుడు, చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్‌ను అధిష్ఠానం గురువారం తాడేపల్లి పిలిచి మాట్లాడినట్టు తెలిసింది. అనకాపల్లి స్థానానికి వైసీపీ అభ్యర్థినిగా విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ సోదరి పిళ్లా రమాకుమారి అభ్యర్థిత్వం ఖరారైనట్టు చెబుతున్నప్పటికీ, ఒకే ఇంట్లో ఇద్దరికి పదవులు ఎందుకన్న ఆలోచనతో మరికొంతమంది పేర్లను పరిశీలిస్తున్నట్టు చెబుతున్నారు. ఈ క్రమంలోనే గవర సామాజిక వర్గానికి చెందిన డేవిడ్ పేరును కొందరు నేతలు సూచించినట్టు సమాచారం. దాంతో తాడేపల్లి పిలిపించి ఆర్థిక స్థోమతతో పాటు ఇతర వివరాలను పార్టీ పెద్దలు అడిగి తెలుసుకున్నట్టు చెబుతున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఎలమంచిలికి మెరుగైన ర్యాంకు

» రీజియన్‌లో 12.. రాష్ట్ర స్థాయిలో 47వ ర్యాంకు


ఎలమంచిలి మునిసిపల్ కార్యాలయం

ఎలమంచిలి, జనవరి 12: స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో ఎలమంచిలి మునిసిపాలిటీ గతంలో కంటే మెరుగుపడింది. రాష్ట్రస్థాయిలో 47, రీజియన్‌లో 12వ ర్యాంకును సాధించుకుంది. మునిసిపాలిటీలో తడి, పొడి చెత్త సేకరణ, ప్రజా మరుగుదొడ్లు, మార్కెట్లు, పారిశుధ్య నిర్వహణ తీరుపై ర్యాంకులను కేటాయించారు. గతంలో ఎలమంచిలి మునిసిపాలిటీ రాష్ట్ర స్థాయిలో 112వ ర్యాంకు వచ్చిందని, ఈసారి మెరుగుపడిందని ప్రజారోగ్య శాఖ అధికారి పల్లా శ్రీనివాసరావు తెలిపారు. మునిసిపాలిటీలో ఇంటింట చెత్త సేకరణ, ప్రజామరుగుదొడ్ల నిర్వహణ, జిమ్‌లు ఏర్పాటు ఆశించిన విధంగా ఉన్నప్పటికీ డ్రైన్‌లో పూడికతీత పనులు, యానాద్రి కాలువ ఆధునీకీకరణకు నోచుకోకపోవడం, వాహనాలకు పార్కింగ్ కేటాయించక పోవడంపై పట్టణ ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది.

ఫిబ్రవరి 29లోగా లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

» జిల్లా ఖజానా అధికారి వి.లక్ష్మీసుభాషిణి

అనకాపల్లి రూరల్, జనవరి 12: జిల్లాలో గల ఉప ఖజానాల పరిధిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల జీవన ధ్రువీకరణ పత్రాలు (లైఫ్ సర్టిఫికెట్స్) ఫిబ్రవరి 29 వరకు స్వీకరిస్తామని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవన, నాన్-ఎంప్లాయిమెంట్ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ పింఛనుదారులు జీవన ధ్రువీకరణ నాన్-ఎంప్లాయిమెంట్‌లతో పాటు నాన్-రీమ్యారేజ్ ధ్రువీకరణ పత్రాలు కూడా జత చేయాలన్నారు. ధ్రువీకరణ పత్రాలు ఉప ఖజానాలు మీ-సేవ కేంద్రాలు, ఇంటర్నెట్ కేంద్రాలు, పోస్టల ద్వారా అందజేయాలని కోరారు. సకాలంలో అందజేయనట్టయితే ఏప్రిల్ నెల పింఛను నిలిపివేస్తామన్నారు.



బియ్యం అందలేదని రేషన్ కార్డులు చూపిస్తున్న ఈ-కొడిసింగి ఆదివాసీలు

రేషన్ అందదు.. ఆకలి తీరదు!

- ఈ.కొడిసింగిలో రెండు నెలలుగా ఇవ్వని బియ్యం
- ఆదివాసీల అవస్థలు.. పట్టించుకోని అధికారులు
- రెవెన్యూ, జీసీసీ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం

గూడెంకొత్తవీధి, జనవరి 12: వంచుల పంచాయతీలోని ఈ.కొడిసింగి గ్రామానికి చెందిన ఆదివాసీలకు రెండు నెలలుగా ఎండీయూ ఆపరేటర్ రేషన్ సరుకులు అందజేయకపోవడంతో అవస్థలు పడుతున్నారు. శుక్రవారం గ్రామంలో రేషన్ కార్డులు చూపిస్తూ బియ్యం అందకపోవడం వల్ల దుకాణాల్లో అధిక ధర పెట్టి కొనుగోలు చేసుకోలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల కథనం ప్రకారం.. ఈ.కొడిసింగి గ్రామంలో 200 ఆదివాసీ కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ప్రతీ కుటుంబానికి రేషన్ కార్డు ఉంది. ఎండీయూ ఆపరేటర్ గ్రామానికి వచ్చి రేషన్ సరకులు అందజేసేవారు. అయితే రెండు నెలలుగా బియ్యం ఇవ్వలేదు. డిసెంబరు, జనవరికి సంబంధించి గ్రామానికి కేవలం 20 రేషన్ కార్డులకు మాత్రమే బియ్యం పంపిణీ చేశారని, మిగిలిన 180 కార్డులకు సంబంధించిన రేషన్ పంపిణీ చేయలేదని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ అందలేదని రెవెన్యూ, జీసీసీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని వాపోయారు. ఎండీయూ ఆపరేటర్ ఇంతవరకు గ్రామానికి వచ్చి రేషన్ పంపిణీ చేసింది లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రేషన్ బియ్యం పంపిణీ చేసి తమ ఆకలి తీర్చాలని ఈ.కొడిసింగి గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థిని ప్రసవంపై ఏఎస్పీ విచారణ



హుకుంపేటలో విద్యార్థిని బంధువుల గృహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ ధీరజ్

హుకుంపేట, జనవరి 12: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని గత నెల ప్రసవించిన ఘటనపై ఏఎస్పీ ధీరజ్ శుక్రవారం విచారణ చేపట్టారు. మండల కేంద్రమైన హుకుంపేటలో బాలిక బంధువుల ఇళ్లకు కూడా వెళ్లి పరిశీలించి ఆయన ప్రశ్నించారు. అలాగే గతంలో బాలిక తిరిగిన ప్రదేశాలు కూడా పరిశీలించి, ఎన్ని రోజుల నుంచి ఇక్కడ ఉన్నారని బంధువులను ఆరా తీశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. అలాగే బాలిక తిరిగిన ప్రదేశాలను సైతం గుర్తించాలని ఎస్ఐ సతీష్‌ను ఆదేశించారు. పిల్లల కుటుంబ సభ్యు అభిప్రాయాలు తీసుకుని, తిరిగి ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలని వారికి ఏఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది గాంధీదాసు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో ఎంతో మేలు

చింతపల్లి, జనవరి 12: గిరిజన రైతులు భూసార పరీక్షలు చేయించుకుంటే ఎంతో మేలు చేకూరుతుందని జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంతల రాజారావు అధ్యక్షతన రైతులు, వ్యవసాయ శాఖ క్షేత్ర స్థాయి ఉద్యోగులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసుకునే పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ ఉద్యోగుల సహకారంతో మట్టి నమూనాలు సేకరించుకుని పరీక్షలు చేయించుకోవడం వల్ల భూమిలోని పోషకాల జాబితా, సూక్ష్మదాతువుల లోపం తెలుస్తుందన్నారు. పరీక్షల ఆధారంగా పంటలకు ఎరువులు పెట్టుకోవాలన్నారు. అలాగే ఆర్బీకేల ద్వారా రాగి పంట కొనుగోలు చేస్తున్న విషయం రైతులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.ఆశాజ్యోతి, ఏవో శ్రీనివాసరావు, అభ్యుదయ రైతు కోరాబు కరుణానిధి పాల్గొన్నారు.

షుగర్ పెరుగుతోంది

... 5వ పేజీ తరువాయి

విభాగానికి వస్తున్న వారిలో ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు తూర్పుగోదావరి, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ వంటి రాష్ట్రాలవారు ఉంటున్నారు. రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైన మందులు అందిస్తున్నారు. ఇన్‌పేషెంట్ల కోసం 30 పడకలతో ప్రత్యేక వార్డు అందుబాటులో ఉంది.

కారణాలు ఇవే..

జన్యుపరమైన కారణాలు, హార్మోన్ల అసమతుల్యతతో పాటు కొవిడ్ తరువాత శారీరక శ్రమ తగ్గడం, ఉద్యోగ భద్రత, ఆర్థికపరమైన ఇబ్బందులతో తీవ్రమైన ఒత్తిడికి గురికావడం, మారిన ఆహారపు అలవాట్లు, సమయానికి నిద్రలేకపోవడం వంటివి షుగర్ రావడానికి కారణమవు తున్నాయి. ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు శారీరక శ్రమ చేయడం వల్ల ఈ సమస్యకు చెక్ చెప్పవచ్చునని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ప్రశాంతమైన జీవనాన్ని అలవాటు చేసుకోవాలి

- డాక్టర్ కేవీవీ సుబ్రహ్మణ్యం, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

ఉరుకులు, పరుగులు జీవితాలతో అనేక అనారోగ్య సమస్యల మాదిరిగానే షుగర్‌ను తెచ్చుకుంటున్నారు. ఒకప్పుడు 50 ఏళ్లు దాటిన వారికి మాత్రమే షుగర్ వచ్చేది. ఇప్పుడు 20 ఏళ్ల వారిలోనూ కనిపిస్తోంది. కొవిడ్ వైరస్ వ్యాప్తి తరువాత బాధితుల సంఖ్య పెరిగింది. ఆహారపు అలవాట్లు, ఒత్తిడికి దూరంగా ఉండడం, సమయానికి నిద్రపోవడం, శారీరక వ్యాయామం.. ఈ నాలుగింటిపై దృష్టిసారిస్తే 90 శాతం షుగర్ దరిదాపుల్లోకి రాదు. కానీ, ఉద్యోగం, వ్యాపారం అంటూ పరుగులు పెడుతుండడం వల్లే సమస్య ఉత్పన్నమవుతోంది. స్కూల్‌కు వెళ్లే చిన్నారులు ఆడుకునేందుకు గ్రౌండ్ లేక పీడియాట్రిక్ డయాబెటిస్ కనిపిస్తోంది. 0.5 శాతం మంది చిన్నారుల్లో ఈ సమస్య ఉంటోంది.

స్పందనకు సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవు

... 5వ పేజీ తరువాయి

స్పందించకుండా, సమస్యను పక్కాగా పరిష్కరించకుండానే పరిష్కరించనట్టు చెబుతున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. మరికొందరు అధికారులు సకాలంలో స్పందన పోర్టల్‌లో లాగిన్ అవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. స్పందన కార్యక్రమంపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శించే అధికారులను ఉపేక్షించబోమన్నారు.

స్పందనలో 87 వినతులు

స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై అధికారులు 87 వినతులను స్వీకరించారు. జి.మాడుగుల మండలం కోరాపల్లి పంచాయతీ పాలకొండ గ్రామానికి చెందిన పి.చిరంజీవి తనకు ఇల్లు మంజూరు చేయాలని, అదే గ్రామానికి చెందిన పాలికి రత్నాలమ్మ రైతు భరోసా మంజూరు చేయాలని కోరారు. పాడేరు మండలం కాడెలి పంచాయతీ గురుపల్లి గ్రామంలో సీసీ రోడ్లు వేయాలని కె.పద్మకుమారి కోరింది. చింతపల్లి మండలం బలపం పంచాయతీ గంజివీధికి గ్రామానికి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి భవనాలు, గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించాలని శాంతి, ఆదినారాయణ అర్జీ అందజేశారు. హుకుంపేట మండలం దిగువమోదాపుట్టు సమీపంలో గతంలో భారీ వర్షాలకు కొట్టుకుపోయిన వంతెనకు మరమ్మతులు చేపట్టాలని సర్పంచ్ జి.శ్యామ్‌సుందర్ కోరారు. ముంచంగిపుట్టు మండలం బంగారుమెట్ట పంచాయతీ పరిధిలోని మాలగుమ్మి గ్రామం నుంచి బూసిపుట్టుకు తారురోడ్డు నిర్మించాలని పలువురు కోరగా, అదే మండలంలో పనసపుట్టు, బోడిపుట్టు, ముక్కాపుట్టు, బొడ్డాపుట్టు గ్రామాలకు విద్యుత్ సదుపాయం కల్పించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్‌కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వీవీ.రమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పి.అంబేడ్కర్, మురళీ, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

- టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రావణ్
- అరకులో చంద్రబాబు సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రావణ్

పాడేరు రూరల్, జనవరి 12: వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. కుమ్మరిపుట్టులోని పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి స్వగృహంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాల్సి బాధ్యత నాయకులపై ఉందన్నారు. అలాగే ఈ నెల 20వ తేదీన పార్టీ ఆధ్వర్యంలో అరకులో నిర్వహించనున్న రా.. కదలి రా.. చంద్రబాబు సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు, నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అవినీతి అక్రమాలను ప్రజలకు వివరించేందుకు పార్టీ అధినేత చంద్రబాబు ఏర్పాటు చేసిన ఈ సభకు పార్టీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో వచ్చేలా ప్రచారం చేయాలని కోరారు. వైసీపీ పాలనలో గిరిజనాభివృద్ధి శూన్యమన్న విషయం ప్రజలకు వివరించాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలోనే రాష్ట్రంతో పాటు గిరిజన ప్రాంతం అభివృద్ధి జరిగిందన్నారు. గిరిజన ప్రాంత ప్రజల ఆరోగ్య రక్షణకు పాడేరులో జిల్లా ఆస్పత్రిని ఏర్పాటు చేసి మినీ కేజీహెచ్‌లా సౌకర్యాలను తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేస్తే, వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆస్పత్రిలో మందులను కూడా పూర్తి స్థాయిలో సమకూర్చకపోవడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఆస్పత్రిలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో, గిరిజన ప్రాంతంలో ఎక్కడికక్కడ మరణాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అధికారం ఇచ్చి రాష్ట్ర, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి మన్యం ప్రజల కృషి చేయాలని వారు కోరారు. అనంతరం గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో శ్రావణ్‌కుమార్‌ను టీడీపీ నాయకులు దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలుపర్తి గోవిందరావు, ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, ఎస్టీ సెల్ కార్యదర్శి గబ్బాడ సింహాచలం, ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి కొట్టగుళ్లి రమేష్‌నాయుడు, రాష్ట్ర తెలుగు యువత కార్య నిర్వాహక కార్యదర్శి కేవీ సురేష్‌కుమార్, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి జి.శివకుమార్, నాయకులు ఎల్.భూషన్, పూర్ణచందరరావు, సత్యనారాయణ, రమేష్, పెద్దినాయుడు, దొరబాబు, బి.జగదీష్, శ్రీను పాల్గొన్నారు.

బాలికను హత్య చేసిన వారిని శిక్షించాలి

- బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి
- కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం



బాలిక కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఈశ్వరి

పాడేరు రూరల్, జనవరి 12: అభం-శుభం తెలియని బాలికపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించి బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలుగుదేశం పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి డిమాండ్ చేశారు. హత్యకు గురైన బాలిక తల్లిదండ్రులతో కలిసి శుక్రవారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో దిశ చట్టం, మహిళా కమిషన్ ఎక్కడ ఉందని ప్రశ్నించారు. 12 ఏళ్ల బాలికపై ఇద్దరు మృగాలు అత్యాచారానికి పాల్పడి హత్య చేసినా మహిళా కమిషన్ పట్టించుకోపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం పెట్టిన దిశ చట్టం ఎక్కడుంది? ఏమి చేస్తుందని ఆమె ప్రశ్నించారు. ప్రజలకు అండగా నిలవాల్సిన ప్రజా ప్రతినిధులు బాధిత కుటుంబానికి కనీసం పరామర్శించకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా వైసీపీ ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందించి అండగా నిలవాలని ఆమె కోరారు. ఇందుకు కలెక్టర్ సుమిత్ కుమార్ సానుకూలంగా స్పందించారన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి సహాయాన్ని అందించేలా తన వంతు కృషి చేస్తానని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసు శాఖకు ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్.చిట్టిబాబు, జి.సింహాచలం, కె.రమేష్‌నాయుడు, జి.శివకుమార్, ఎం.రమేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



అంగన్‌వాడీ కార్యకర్తలకు భోజనాలు పెడుతున్న వారియర్స్ ప్రతినిధులు

చింతపల్లి, జనవరి 12: మన్యంలో అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం నాటి ఈ సమ్మె 32వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. అలాగే నిరశన దీక్షలు చేస్తున్నారు. చింతపల్లి మండల కేంద్రంలో ఆందోళన చేపడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు చేయూత వారియర్స్ ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలకు వ్యక్తిగత నిధులతో భోజనాలకు పెట్టి ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా చేయూత వారియర్స్ చైర్మన్ దూనబోయిన రమణ అంగన్‌వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లు వైసీపీ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు. 32 రెండు రోజులుగా వారు సమ్మె చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని ఆయన వాపోయారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందించడం, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ విధులు నిర్వహించే అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలపై ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్లు నెరవేర్చి సమ్మెను విరమింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్, మండల కార్యదర్శి సాగిన చిరంజీవి, చేయూత వారియర్స్ ప్రతినిధులు బిలాస్కుర్, ఇండుగ శేఖర్, గంగల శివ, కొండలరావు, అధ్యక్ష, కార్యదర్శి పెంటమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మె మండలంలో కొనసాగుతోంది. శుక్రవారం సమ్మెలో భాగంగా జాతీయ రహదారిలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

గిరిజనులకు దుక్కు సేవలు మరువలేం

టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర



దుక్కు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దొన్నుదొర, నాయకులు

అరకులోయ, జనవరి 12: గిరిజనులకు దుక్కు అందించిన సేవలు మరువలేమని టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. అరకులోయ ప్రధాన రహదారి పక్కన మాజీ ఎమ్మెల్యే ఎల్‌బి.దుక్కు విగ్రహాన్ని అతని కుమారుడు ఎల్‌బీ.వెంకట్రావు, పలువురు కుటుంబ సభ్యుల సమక్షంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ చైతన్యం లేని సమయంలో మైదాన ప్రాంతంతో కలిసి ఎస్టీ నియోజకవర్గంగా ఉండే ఎస్.కోట నియోజకవర్గానికి వరుసగా నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా తెలుగుదేశం పార్టీ నుంచి ఎన్నికైన సీనియర్ నేత దుక్కు అని కొనియాడారు. ఆ రోజుల్లో ఐటీడీఏ, గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలను నాటి సీఎం ఎన్టీ రామారావుతో ప్రారంభోత్సవం చేసిన ఘనత దుక్కుకే దక్కుతుందన్నారు. అలాగే గిరిజనులకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో అరకులోయ, పాడేరు నియోజకవర్గాల పరిధితో పాటు ఎస్.కోట ప్రాంతం నుంచి పలువురు నాయకులు, ఉద్యోగులు, అభిమానులు వచ్చి దుక్కుకు ఘనంగా నివాళులు అర్పించారు.

ఇద్దరు గంజాయి స్మగ్లర్లు అరెస్టు



గంజాయి నిందితులతో ఎస్ఐ, పోలీసులు

ముంచంగిపుట్టు, జనవరి 12: ద్విచక్ర వాహనంపై ఐదు కిలోల గంజాయి తరలిస్తున్న ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసినట్టు ఎస్ఐ కె.రవీంద్ర తెలిపారు. బూసిపుట్టు వైపు నుంచి ముంచంగిపుట్టు వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు కుమడ సమీపంలో పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారని చెప్పారు. వెంటనే పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారన్నారు. అలాగే ద్విచక్ర వాహనం డిక్కీని తెరిచి చూడగా సుమారు ఐదు కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించామన్నారు. గంజాయి, ద్విచక్ర వాహనం, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని ఇద్దర్ని అరెస్టు చేశామన్నారు. వీరిని బూసిపుట్టు పంచాయతీ సుల్తాన్‌పుట్టు గ్రామానికి చెందిన కె.సన్యాసిరావు, ఒడిశా కలహండి జిల్లా బండిబాసుల్ గ్రామానికి చెందిన బబ్లూ మెహెర్‌గా గుర్తించామన్నారు. వారిని కోర్టుకు తరలించామని ఎస్ఐ వివరించారు.

అరకు సంతకు పండగ కళ



కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయిన అరకు వారపు సంత

డుంబ్రిగుడ, జనవరి 12: మండలంలోని అరకు సంతబయలులో శుక్రవారం జరిగిన సంతలో సంక్రాంతి కళ ఉట్టిపడింది. పండగను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల గిరిజనులు నూతన వస్త్రాలతో పాటు ఇతర వస్తువులు కొనుగోలు చేయడానికి తరలిరావడంతో సంత కిక్కిరిసిపోయింది. వస్త్ర దుకాణాల్లో గిరిజనులు కుటుంబ సమేతంగా బారులు తీరారు. నాటుకోళ్లు, మేకలకు గిరాకీ పెరిగింది. అరకులోయ, డుంబ్రిగుడ మండలాలకు వేదికగా ప్రధాన సంత కావడంతో చాలా గ్రామాల నుంచి గిరిజనులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. దీంతో వారపు సంతలో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.

రూపుమారిన దారెల రహదారి

- రోడ్డు ఆద్యంతం గతుకులు.. తేలిపోయిన రాళ్లు
- వాహన చోదకులు, పాదచారుల అగచాట్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

ముంచంగిపుట్టు, జనవరి 11: మండలంలోని దారెల పంచాయతీ కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డు రూపుమారిపోయింది. రహదారి ఆద్యంతం ఎక్కడికక్కడ గతుకులు ఏర్పడ్డాయి. దీంతో రాకపోకలకు ప్రజలు, వాహన చోదకులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కిలగాడ ప్రధాన రహదారి నుంచి దారెల వరకు సమారు నాలుగు కిలోమీటర్ల మార్గం ఉంది. ఈ రహదారిపై ఎక్కడపడితే అక్కడ రాళ్లు తేలిపోయి గోతులు ఏర్పడ్డాయి. దీంతో అటుగా రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. పలు సందర్భాల్లో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న ఈ రహదారి మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులకు ఎన్నిసార్లు వినతులు అందించినా కనీసం పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు, వాహన చోదకులు మండిపడుతున్నారు. ఫలితంగా రోజురోజుకూ రహదారి మరింత ప్రమాదకరంగా మారుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారి పూర్తి స్థాయిలో దెబ్బతినక ముందే మరమ్మతు పనులు చేపట్టాలని వారు వేడుకుంటున్నారు.



రాళ్లు తేలిపోయిన ప్రమాదకరంగా మారిన రహదారి

సంక్షిప్తంగా..

ఆదివాసీలకు ఉచితంగా విద్యుత్ సదుపాయం: ఏఈఈ ప్రభాకరరావు



మాట్లాడుతున్న ఏఈఈ

చింతపల్లి, జనవరి 12: ఆదివాసీల నివాస గృహాలకు శతశాతం విద్యుత్ సదుపాయం కల్పిస్తామని ఈపీడీసీఎల్ ఏఈఈ వనుము ప్రభాకరరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలో 1517 పీవీటీజీ కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్ లేదని సర్వేలో గుర్తించామన్నారు. పీఎం-జన్‌మన్ పథకంలో భాగంగా నెలాఖరు నాటికి వారికి విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేస్తామన్నారు. పీవీటీజీ కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు అందజేస్తామని, ఈపీడీసీఎల్‌కి పైసా చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. కుదుముసారి పంచాయతీ పరిధిలో ఇప్పటికే 55 పీవీటీజీ కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వ నిధులతో ఉచితంగా విద్యుత్ మీటర్లు, వైరింగ్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ మొట్టడం గంగరాజు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

సబ్ డీఎఫ్‌వో సూర్యనారాయణ



చింతపల్లి, జనవరి 12: అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని డివిజనల్ ఫారెస్టు అధికారి (డీఎఫ్‌వో) చిట్టపుల్లి సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం అటవీ శాఖ ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ చింతపల్లి డివిజన్ పరిధిలోని రిజర్వుడ్ ఫారెస్టు భూముల్లో 788 ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నట్టు భారత ప్రభుత్వం నివేదిక ఇచ్చిందన్నారు. ప్రస్తుత సీజన్‌లో చెట్ల నుంచి ఆకులు రాలిపోతాయని, అడవికి వెళ్లిన ఆదివాసీలు అగ్గి పెట్టుకుని ఆర్పివేయకుండగా వచ్చేయడంతో తగలబడుతున్నాయని చెప్పారు. ప్రధానంగా వెదురు మొక్కలు కలిగిన ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సీలేరు, ఆర్వీ నగర్, చింతపల్లి, మర్రిపాకలు (డౌనూరు) రేంజ్‌ల పరిధిలో అడవులు అధికంగా ఉండడంతో ఉద్యోగులను అప్రమత్తం చేశామన్నారు. అడవి వెళ్లినప్పుడు ఎక్కడా మంట పెట్టరాదని ప్రజలకు ఆయన సూచించారు. అలాగే అడవుల్లో అటవీశాఖ ఉద్యోగులు ఫైర్‌లైన్ క్లియరెన్స్ పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించే ప్రాంతాల్లో ఫైర్‌లైన్లు ఏర్పాటు చేస్తారన్నారు. అడవుల సంరక్షణకు ఆదివాసీలు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి, పెదవలస రేంజ్ అధికారులు పాత్రుడు, జగదీశ్వరరావు పాల్గొన్నారు.

బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలి

గూడెంకొత్తవీధి, జనవరి 12: మండలంలోని శివారు గిరిజన గ్రామంలో అత్యాచారం, హత్యకు గురైన బాలిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు ముక్కలి రమేష్ డిమాండ్ చేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యురాలు గంటా నళినితో కలిసి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత మన్యంలో ఇటువంటి చర్యలు జరగడం దురదృష్టకరమన్నారు. ఈ ఘటనకు కారకులైన వ్యక్తులు కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత కుటుంబాన్ని ఇంతవరకు అధికారులు, ప్రజాప్రతినిధులు పరామర్శించి ఓదార్చకపోవడ విచారకరమని ఆయన వాపోయారు. ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబానికి రావాల్సిన రాయితీలు తక్షణమే అందజేయాలని డిమాండ్ చేశారు

16, 17 తేదీల్లో తేలికపాటి వర్షం

చింతపల్లి, జనవరి 12: జిల్లాలో ఈ నెల 16, 17 తేదీల్లో తేలికపాటి వర్షం కురుస్తుందని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్ కుమార్ తెలిపారు. రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు శుక్రవారంప్రకటించారు. 15వ తేదీ వరకు వర్షసూచన లేదని, 16, 17 తేదీల్లో కనిష్ఠంగా 0.4 మి.మీ.లు, గరిష్ఠంగా 2.9 మి.మీ.ల వర్షపాతం నమోదవుతుందన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

అరకులోయ, జనవరి 12: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మీ, నాగబాబు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పుష్పరాజ్, అధ్యాపకులు వివేకనందుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ పీవో నాగబాబు మాట్లాడుతూ వివేకానంద స్ఫూర్తితో అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విజయలక్ష్మీ, లలితకుమారి, గనేష్, సుందరివాణి, ఎస్.రాజు, లచ్చన్న, అప్పారావు, కళా శాల యువతీ, యువకులు పాల్గొన్నారు.



వివేకానంద చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం